
కౌడిపల్లి: పిల్లుట్లలో ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి

మహాలక్ష్మీ మాతగా దుర్గాదేవి

చిలిపిచెడ్‌లో.. నిజాంపేటలో హోమంలో దంపతులు

రామాయంపేట: మహాలక్ష్మి దేవీగా..

మహాలక్ష్మీదేవి అవతారంలో దుర్గమ్మ

శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మహా లక్ష్మీదేవీగా అమ్మవారు ఆదివారం భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారిని పట్టు వస్త్రాలతో అలంకరించారు. అనంతరం మంగళహారతులు, నైవేద్యాలు సమర్పించారు. భక్తిశ్రద్ధలతో వైభవంగా పూజలు జరిపించారు. మెదక్ జిల్లా కేంద్రంలో దుర్గామాత అన్నపూర్ణాదేవి రూపంలో భక్తులకు దర్శనమిచ్చింది. మరికొన్ని ప్రాంతాల్లో అమ్మవారిని సరస్వతీ దేవిగా అలంకరించారు. అనంతరం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. పలు మండపాల వద్ద అన్నదానం చేశారు. నిజాంపేటలోని దుర్గామాత బాలా త్రిపుర సుందరీ దేవి అవతారంలో దర్శనమిచ్చారు. శివ్వంపేట మండలం చిట్కుల్ గ్రామ శివారులోని చాముండేశ్వరి ఆలయంలో అభిషేకాలు, జపములు, పారాయణ, మహాపూజ, మహానివేదన, హారతి ప్రత్యేక పూజలు చేశారు. దేవీ శరన్నవరాత్రోత్సవాల్లో భాగంగా ఏడుపాయల దుర్గమ్మ కూశ్మాండ మాత అలంకరణతో దర్శనమిచ్చారు. సంగారెడ్డి జిల్లా అదనపు కలెక్టర్ వి.చంద్రశేఖర్ దంపతులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.

- న్యూస్‌నెట్‌వర్క్, మెదక్, అక్టోబర్ 6

చిన్నశంకరంపేట: అమ్మవారి పూజలో మాలధారులు

చేగుంట: కర్నాల్‌పలిల్లోని దుర్గమాత పూజల్లో భక్తులు

పాపన్నపేట: పూజల్లో అదనపు కలెక్టర్ చంద్రశేఖర్

నిజాంపేట: చండీహోమంలో పలువురు దంపతులు

గౌరమ్మా నిను కొలుతునమ్మా..

మెదక్ మున్సిపాలిటీ/రామాయంపేట/చేగుంట, అక్టోబర్ 6: జిల్లా కేంద్రం మెదక్‌లో ఐదో రోజు ఆదివారం ఎంగిలి పూల బతుకమ్మతో పూల జాతర కొనసాగింది. మహిళలు రంగురంగుల పూలతో బతుకమ్మలను అలంకరించి పట్టణంలోని ప్రధాన కూడళ్లలో పెట్టి ఆడిపాడారు. మన సంస్కృతి సంప్రదాయలకు అద్దం పట్టే పండుగ బతుకమ్మ.. గౌరమ్మ నిను కోలుతూ అంటూ బతుకమ్మ ఆటపాటలతో ఆడిన అనంతరం చెరువులు, కాలువలలో నిమజ్జనం చేశారు. ఇస్తినమ్మా వాయనం.. పుచ్చుకుంటినమ్మ వాయనం అంటూ ఒకరికొకరి ఆత్మీయ పలకరింపుతో వాయినాలు ఇచ్చిపుచ్చుకున్నారు.

రామాయంపేటలో

రామాయంపేటలోని మహంకాళి, దుర్గమ్మ ఆలయం, రెడ్డి కాలనీ, టీచర్సు, వెంకటేశ్వర, ఎస్సీ కాలనీ, బీసీ కాలనీ, కేసీఆర్ కాలనీతో బాటు గొల్పర్తి, కోమటిపల్లి తదితర ప్రాంతాల్లో మహిళలు బతుకమ్మలు ఆడారు. మండలంలోని కోనాపూర్, కాట్రియాల, డి.ధర్మారం, అక్కన్నపేట, ఝాన్సీలింగాపూర్, లక్ష్మాపూర్, తొనిగండ్ల తదితర గ్రామాలలో బతుకమ్మల ఆటలు ఆడి చెరువుల్లో నిమజ్జనాలు చేశారు. అనంతరం తమ వెంట తెచ్చుకున్న సద్దులను ఇరువురికి ఇచ్చిపుచ్చుకున్నారు.

చేగుంటలో..

చేగుంట మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థినులు తీరొక్క పువ్వులతో బతుకమ్మలు పేర్చి, పాటలు పాడుతూ ఆడుతూ ఊరేగించారు. చేగుంటలోనూ మహిళలు, చిన్నారులు బతుకమ్మ ఆడి, పాడి స్థానిక చెరువులో నిమజ్జనం చేశారు.

చిన్నశంకరంపేటలో బతుకమ్మ ఆడుతున్న మహిళలు

చేగుంట ప్రభుత్వ జూనియర్ కళాశాలలో


మెదక్ మున్సిపాలిటీ:బతుకమ్మ ఆడుతున్న మహిళలు

రామాయంపేట: అక్కన్నపేటలో బతుకమ్మ

అట్టహాసంగా రాష్ట్రస్థాయి ఫుట్ బాల్ పోటీలు

ఉమ్మడి పది జిల్లాల నుంచి 180 మంది క్రీడాకారుల హాజరు

మెదక్ మున్సిపాలిటీ, అక్టోబర్ 6: పాఠశాల క్రీడా సమాఖ్య మెదక్ జిల్లా ఆధ్వర్యంలో 68 వ రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ (అండర్-17 బాలికలు) చాంపియన్‌షిప్ పోటీలు ఆదివారం ఇందిరాగాంధీ స్టేడియంలో అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. ఈ పోటీలను మెదక్ మున్సిపల్ చైర్మన్ చంద్రపాల్ ప్రారంభించారు. అంతకుముందు క్రీడాకారులు నుంచి మార్చ్‌ఫాస్ట్ నిర్వహించగా ముఖ్య అతిథులు గౌరవ వందనం స్వీకరించారు. ఈ పోటీల్లో రాష్ట్రంలోని ఉమ్మడి పది జిల్లాల నుంచి 180 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. తొలి రోజు వివిధ జిల్లాల మధ్య పోటీలు ఇందిరా గాంధీ స్టేడియం, వెస్లీ స్కూల్ మైదానంలో నిర్వహించారు. క్రీడలతో క్రమశిక్షణ, నిరంతర సాధనతో విజయాలను సొంతం చేసుకోవచ్చని మున్సిపల్ చైర్మన్ చంద్రపాల్ తెలిపారు. ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి రమేశ్, జిల్లా ఫుట్‌బాల్ అసోసియేషన్ బాధ్యుడు నాగరాజు మాట్లాడారు. కార్యక్రమంలో ఫుట్‌బాల్ క్రీడా రాష్ట్ర పరిశీలకులు ఆదర్శ్ జిల్లా స్పోర్ట్స్ ఫౌండేషన్ సభ్యులు జుబేర్, ఎమ్ఎల్ఎన్ రెడ్డి, ఇండియా ఖేలో కన్వీనర్ విష్ణుతేజ, పీఈటీలు మాధవరెడ్డి, వినోద్, చంద్రమోహన్, ప్రభాకర్, రూపేందర్ శ్యామయ్య, రవి, మాలతి పాల్గొన్నారు.

మాట్లాడుతున్న మున్సిపల్ చైర్మన్ చంద్రపాల్

మెదక్, నిజామాబాద్ జిల్లాల మధ్య ఫుట్‌బాల్ మ్యాచ్

కళాశాలలు, విద్యాలయాలు సరస్వతి నిలయాలు

-జిల్లా ఇంటర్ నోడల్ అధికారి మాధవి

సరస్వతీమాత విగ్రహ ప్రతిష్ఠాపనలో హోమం నిర్వహిస్తున్న భక్తులు

చేగుంట, అక్టోబర్ 6: కళాశాలలు, విద్యాలయాలు సరస్వతీ నిలయాలు అని జిల్లా ఇంటర్ నోడల్ అధికారి మాధవి పేర్కొన్నారు. మండల కేంద్రమైన చేగుంటలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో దాతల సహకారంతో ఏర్పాటు చేసిన చదువుల తల్లి సరస్వతీ మాత విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవ కార్యక్రమాన్ని ప్రిన్సిపాల్ కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు, హోమం నిర్వహించారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగాం ఆఫీసర్ ప్రమోద్‌కుమార్, అధ్యాపకులు బాలయ్య, నీరజ, లక్ష్మణ్, శ్యాంసుందర్, యాదిగిరి, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్‌గా సుహాసినిరెడ్డి

నర్సాపూర్, అక్టోబర్ 6: మెదక్ జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్‌గా సుహాసినిరెడ్డిని రాష్ట్ర ప్రభుత్వం నియమించింది. ఇందుకు సంబంధించిన ఉత్తర్వులను ఆదివారం రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసింది. నర్సాపూర్ నియోజకవర్గం కౌడిపల్లి గ్రామానికి చెందిన సుహాసినిరెడ్డి కాంగ్రెస్ జిల్లా నాయకురాలిగా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. సుహాసినిరెడ్డిని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్‌గా నియమించడంతో నియోజకవర్గంలో కాంగ్రెస్ శ్రేణులు, అభిమానులు హర్షం వ్యక్తం చేశారు.

పరిస్థితి విషమించి వ్యక్తి మృతి

ఆకుల రాజు (ఫైల్)

కౌడిపల్లి, అక్టోబర్ 6: చికిత్స పొందుతూ పరిస్థితి విషమించడంతో వ్యక్తి మృతి చెందిన ఘటన కౌడిపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకున్నది. మెదక్ మండలం పాతూరు గ్రామానికి చెందిన ఆకుల రాజు (45) ఈనెల 5న పని నిమిత్తం తన బైక్‌పై హైదరాబాద్‌కు వెళ్లి, తిరిగి ఇంటికి వస్తున్న క్రమంలో కౌడిపల్లి గ్రామ శివారులోని ఇండియన్ పంచర్ షాప్‌లో నుంచి ట్రాక్టర్ అతివేగంగా వచ్చి బైక్‌పై ఉన్న రాజును ఢీకొట్టింది. ఈ విషయం తెలుసుకున్న స్థానిక పోలీసులు హుటాహుటిన అతడిని నర్సాపూర్ ప్రభుత్వ దవాఖానకు తరలించారు. అతడిని పరీక్షించిన డాక్టర్లు మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌లోని సూరారం దవాఖానకు తరలించారు. అక్కడ అతడు చికిత్స పొందుతూ పరిస్థితి విషమించడంతో ఆదివారం మృతి చెందాడు. మృతుడి భార్య ఆకుల విమల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై రంజిత్ రెడ్డి తెలిపారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
WANTED
★త్రివేణి హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం. జీతం: 18K. 9160900024 / 9640400073.
NT-331783-All
గమనిక: క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్/డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

భక్తులతో కిటకిటలాడిన మెదక్ చర్చి

ప్రార్థనల్లో పాల్గొన్న భక్తులు

మెదక్ మున్సిపాలిటీ, అక్టోబర్ 6: ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన మెదక్ మహా దేవాలయం ఆదివారం భక్తులతో కిటకిటలాడింది. సుదూర ప్రాంతాల నుంచి భక్తులు, పర్యాటకులు పెద్ద ఎత్తున తరలిరావడంతో ప్రాంగణమంతా సందడి నెలకొంది. ఉదయం నుంచి మధ్యాహ్నం 1 గంటల వరకు జరిగిన ప్రత్యేక ప్రార్థనల్లో వేలాది మంది భక్తులు పాల్గొన్నారు. చర్చి ప్రెసిబెటరీ ఇన్‌చార్జి రెవరెండ్ శాంతయ్య భక్తులనుద్దేశించి దైవ సందేశం వినిపించారు. పాస్టర్లు డేవిడ్ రిచర్డ్స్, జైపాల్, శ్రీనివాస్ భక్తులను ఆశీర్వదించారు. ఈ సందర్భంగా చర్చి కమిటీ సభ్యులు భక్తిగీతాలను ఆలపించారు. భక్తులు మొక్కులు తీర్చుకొని చర్చిలోని చెట్లకింద వంటావార్పు చేసుకున్నారు. ప్రార్థనల్లో చర్చి కమిటీ సభ్యులు గంట సంపత్, జాన్సన్, సువన్‌డగ్లస్, సంశాన్ సందీప్, జాయ్‌ముర్రే పాల్గొన్నారు.

సీఎం సహాయనిధి చెక్కు అందజేత

చెక్కును అందిస్తున్న కాంగ్రెస్ నాయకులు

చిన్నశంకరంపేట, అక్టోబర్ 6: మండలంలోని శాలిపేటకు చెందిన లింగం అనారోగ్యంతో దవాఖానలో చికిత్స చేయించుకున్నాడు. ముఖ్యమంత్రి సహాయనిధికి దరఖాస్తు చేసుకోగా మంజూరైన రూ.30వేల చెక్కును కాంగ్రెస్ నాయకుడు పోశెట్టి అందించాడు. ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

రెండు బైకులు ఢీకొని ఇరువురికి గాయాలు

కౌడిపల్లి, అక్టోబర్ 6: రెండు బైకులు ఢీకొని ఇరువురికి తీవ్ర గాయాలైన ఘటన కౌడిపల్లి మండల కేంద్రంలో ఆదివారం చోటుచేసుకున్నది. స్థానిక ఎస్సై రంజిత్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని కంచాన్‌పల్లి గ్రామానికి చెందిన సిరినేని చందర్‌రావు, దేవులపల్లి గ్రామానికి చెందిన చాకలి పోచయ్య ఎదురెదురుగా వస్తున్నారు. ఈ రెండు బైకులు ఢీకొన్నాయి. దీంతో ఇరువురికి తీవ్ర గాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న స్థానిక పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని, వీరిని దవాఖానకు తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తామని ఎస్సై తెలిపారు.

నేడు మెదక్‌లో బతుకమ్మ ఉత్సవాలు

మెదక్ మున్సిపాలిటీ, అక్టోబర్ 6: జిల్లా కేంద్రం మెదక్‌లోని ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల మైదానంలో మైనంపల్లి సోషల్ సర్వీస్ ఆర్గనైజేషన్ (ఎమ్ఎస్ఎస్ఎవో) ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించే బతుకమ్మ ఉత్సవాలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. ఈ ఉత్సవాలకు ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్‌రావుతో పాటు పలువురు ప్రజాప్రతినిధులు హాజరుకానున్నారు. ఈ ఉత్సవంలో ఎమ్ఎస్ఎస్ఎవో ఆధ్వర్యంలో నియోజకవర్గంలోని పది వేల మంది ఆడపడుచులకు పట్టు చీరలు ఎమ్మెల్యే అందజేయనున్నారు.

ఉరేసుకుని వ్యక్తి ఆత్మహత్య

నిజాంపేట, అక్టోబర్ 6: అనారోగ్యంతో బాధపడుతూ మనస్తాపానికి గురైన ఓ వ్యక్తి చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలోని నార్లపూర్‌లో ఆదివారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన మిరుదొడ్డి కుమార్ (41) కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. ఆరోగ్యం బాగాలేక కుటుంబాన్ని సరిగ్గా చూసుకోక పోతున్నానని కుమార్ మనస్తాపంతో ఆదివారం గ్రామ శివారులోని వ్యవసాయ పొలంలో చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి భార్య మంజుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై జైపాల్‌రెడ్డి తెలిపారు.

అదృశ్యమైన వ్యక్తి మృతదేహం లభ్యం

నర్సయ్య(ఫైల్)

చేగుంట,అక్టోబర్ 6: పశువులకాడికి వెళ్లి అదృశ్యమైన వ్యక్తి మృతదేహం లభ్యమైన ఘటన చేగుంట మండలం మక్కరాజిపేటలో ఆదివారం జరిగింది. చేగుంట పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. అంతు నర్సయ్య(60) గత నెల 14న పశువుల కాడికి వెళ్లి రాత్రి వరకు తిరిగి రాలేదు. దీంతో వారి కుటుంబ సభ్యులు గ్రామస్తులు, చుట్టుపక్కలవారిని, బంధువుల వద్ద వెతికినా ఆచూకీ లభించలేదు. నర్సయ్య కుమారుడు అంతు సిద్దిరాములు చేగుంట పోలీసులకు ఫిర్యాదు చేశాడు. గ్రామ సమీపంలోని లీగం కుంటలో పూర్తిగా కుళ్లిపోయిన మృతదేహం గుర్తించారు. ఈ మేరకు చేగుంట పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పీఆర్టీయూ సమావేశాలను విజయవంతం చేయాలి

మెదక్ మున్సిపాలిటీ, అక్టోబర్ 6: ఈనెల 7, 8వ తేదీల్లో హైదరాబాద్‌లో జరిగే పీఆర్టీయూ 35వ రాష్ట్ర కౌన్సిల్ సమావేశాన్ని విజయవంతం చేయాలని జిల్లా అధ్యక్ష కార్యదర్శులు సుంకరి కృష్ణ, సామ్యా నాయక్‌లు ఆదివారం ప్రకటనలో పేర్కొన్నారు.

అక్రమ మద్యం పట్టివేత ఒకరిపై కేసు నమోదు

రేగోడ్, అక్టోబర్ 6: మండలంలోని వెంకటాపూర్ మక్త గ్రామంలో బెల్టు షాపులపై ఎక్సైజ్ అధికారులు దాడులు చేశారు. ఈ దాడుల్లో అక్రమ మద్యం పట్టుకున్నారు. ఒక వ్యక్తిపై కేసు నమోదు చేశారు. ఇంకొకరిపై కేసు నమోదు చేయలేదు.

కొయ్యగుట్ట మల్లన్నకు పూజలు

మెదక్‌రూరల్, అక్టోబర్ 6: మంబోజిపల్లి శివారులోని కొయ్యగుట్ట మల్లన్న ఆలయంలో ఆదివారం పూజరి మల్లయ్య ఆధ్వర్యంలో ప్రత్యేకపూజలు చేశారు. స్వామికి భక్తులు ఒడిబియ్యం సమర్పించారు. అనంతరం అన్నదానం చేశారు.


నర్సాపూర్‌లో సీఎంఆర్ఎఫ్ చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి

సీఎం సహాయ నిధి నిరుపేదలకు వరం

చెక్కులు అందజేసిన ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి, ఎమ్మెల్సీ శేరి సుభాష్‌రెడ్డి


రామాయంపేటలో సీఎంఆర్ఎఫ్ చెక్కులు అందిస్తున్న ఎమ్మెల్సీ శేరి సుభాష్‌రెడ్డి

నర్సాపూర్/రామాయంపేట, అక్టోబర్ 6: నర్సాపూర్ మున్సిపల్ ఎన్‌జీవోస్ కాలనీకి చెందిన చాకలి భాగమ్మకు మంజూరైన రూ.54 వేల సీఎంఆర్ఎఫ్ చెక్కును ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి బాధిత కుటుంబ సభ్యులకు ఆదివారం క్యాంప్ కార్యాలయంలో అందజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ నయీమొద్దీన్, మాజీ జడ్పీ కోఆప్షన్ మెంబర్ మన్సూర్, బీఆర్ఎస్ నాయకులు సత్యంగౌడ్, సూరారం నర్సింహులు, షేక్ హుస్సేన్, యాదాగౌడ్, మహేందర్‌రెడ్డి, మొహమ్మద్, రింగుల ప్రసాద్, జగపతి, శ్రీకాంత్‌రెడ్డి పాల్గొన్నారు.

రామాయంపేటలో..

సీఎం సహాయ నిధి నిరుపేదలకు లాభం చేకూరుస్తుందని ఎమ్మెల్సీ శేరి సుభాష్‌రెడ్డి అన్నారు. ఆదివారం క్యాంపు కార్యాలయంలో మండలంలోని రాయిలాపూర్ గ్రామానికి చెందిన రాములు, కోనాపూర్ గిరిజన తండాకు చెందిన మమత, మరో ఇద్దరికి సీఎంఆర్ఎఫ్ చెక్కులు అందజేశారు. అనారోగ్యంతో ప్రైవేట్ దవాఖానలో చికిత్స పొందిన లబ్ధిదారులు దరఖాస్తులు పెట్టుకోవాలన్నారు. ఈ సహాయం పేదలకు కొంతమేరకు ఊరటనిస్తుందన్నారు. ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు.

ఇది ముమ్మాటికీ ప్రభుత్వ హత్యే


బాధిత కుటుంబీకులతో మాట్లాడుతున్న డీబీఎఫ్ జాతీయ కార్యదర్శి శంకర్

రామాయంపేట, అక్టోబర్ 6: శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానంతో దూసుకువెళ్తున్న సమాజంలో అదే స్థాయిలో మూఢనమ్మకాలు నమ్మడం హేయమైన చర్య, ఇలాంటి చర్యలను ప్రభుత్వం పెంచి పోషిస్తుండడంతోనే దళిత బహుజనులు బలవుతున్నారని, ఇది ముమ్మాటికి ప్రభుత్వ హత్యేనని డీబీఎఫ్ జాతీయ కార్యదర్శి పి.శంకర్, జిల్లా అధ్యక్షుడు దుబాషి సంజీవు, కార్యదర్శి దయాసాగర్ ఆరోపించారు. ఆదివారం మండలంలోని కాట్రియాల గ్రామంలో డ్యాగల ముత్తవ్వ(45)ను విచక్షణారహితంగా కర్రలతో బాది, పెట్రోల్ పోసి నిప్పంటించి సజీవ దహనానికి పాల్పడడం మంచి పద్ధతి కాదన్నారు. సమాజంలో దెయ్యాలు, మంత్రాలను నమ్మడం సరికాదన్నారు. ఇంలాంటి ఘటనలకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు చేపట్టాలని డీబీఎఫ్ సభ్యుడు డిమాండ్ చేశారు.

పేదలకు సేవ చేయడమే లక్ష్యం: డాక్టర్ మోహన్

నిజాంపేట: బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం అందజేస్తున్న మోహన్‌నాయక్

మెదక్ మున్సిపాలిటీ/నిజాంపేట, అక్టోబర్ 6: పేదలకు సేవ చేయడంతో సంతృప్తినిస్తుందని లీలా సంస్థ చైర్మన్ డాక్టర్ మోహన్‌నాయక్ అన్నారు. మెదక్‌లోని పిట్లంబేష్ వీధికి చెందిన బేస్త గోపాల్ అనారోగ్యంతో మృతి చెందాడు. ఆ కుటుంబాలనికి రూ. 5వేల ఆర్థిక సాయం అందించారు. నిజాంపేట మండలం రాంపూర్‌కు చెందిన దేవరాజు కుంటలో పడి మృతి చెందాడు. విషయం తెలుసుకున్న మోహన్‌నాయక్ బాధిత కుటుంబాన్ని ఆదివారం పరామర్శించి రూ.5 వేలు ఆర్థిక సాయం, 25 కిలోల బియ్యం అందజేశారు.

కేరళ గురువులకు పూర్వ విద్యార్థుల సన్మానం

మెదక్ మున్సిపాలిటీ, అక్టోబర్ 6: మెదక్‌లోని వివేకానంద పబ్లిక్ స్కూల్‌కు చెందిన పూర్వ విద్యార్థులు మేడిశెట్టి శంకర్, సతీశ్ రావు, రవికుమార్, మేఘన, రాజు, సాయి శ్యామ్ కేరళలో నివసిస్తున్న తమ గురువులు జమీల, శ్యామల, రాధికను సన్మానించారు.

వీఆర్ఏలను రెగ్యులర్ చేయాలని వినతి

చేగుంట, అక్టోబర్ 6: వీఆర్ఏలను రెగ్యులర్ చేయాలని కోరుతూ అడిషనల్ కలెక్టర్ వెంకటేశ్వర్లుకు ఆ సంఘం జిల్లా కార్యవర్గం సభ్యులు వినతి పత్రం అందజేశారు. సమర్పించారు. రాష్ట్ర ప్రభుత్వం వీఆర్ఏలను రెగ్యులర్ చేస్తూ కారుణ్య వారతస్వ నియామకాల కోసం జీఓ నం81, 85 ప్రకారం 3797 మందికి 61 సంవత్సరాల పైబడిన వారసులకు ఉద్యోగ నియామకం కోసం జారీ చేసిందన్నారు. హైకోర్టు డివిజన్ బెంచ్ 81జీవోను ఎత్తి వేసిందని, విద్యార్హత గల వారు తహసీల్దార్ కార్యాలయంలో సేవలు అంది స్తూ, ప్రభుత్వ కార్యక్రమాల్లో నిర్వహిస్తున్నా రని, తమ కుటుంబాలను ఆదుకోవాలని వారు కోరారు. వినతి పత్రం ఇచ్చిన వారిలో జిల్లా అధ్యక్షుడు లక్ష్మణ్, నాగరాజు, చేగుంట భూపాల్, శివకుమార్, వీరేశం, నాగరాజు, కిష్టయ్య, శ్రీశైలం, నవీన్ ఉన్నారు.

భవిష్యత్ నిర్మాణానికి పునాదులు వేయాలి

ర్యాలీ తీస్తున్న ఆర్ఎస్ఎస్ కార్యకర్తలు

రామాయంపేట, అక్టోబర్ 6: భవిష్యత్ నిర్మాణానికి యువ కార్యకర్తలు పునాదులు వేయాలని ఆర్ఎస్ఎస్ ప్రాంత సహ రాష్ట్ర ప్రముఖ్ చక్రవర్తి రామకృష్ణ పేర్కొన్నారు. ఆదివారం ఆర్ఎస్ఎస్ వంద సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా పట్టణంలో మూడు మండలాల ఆర్ఎస్ఎస్ కార్యకర్తలు భారీ ర్యాలీ తీశారు. మంజీరా విద్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో రాష్ట్ర సహ ప్రముఖ్ చక్రవర్తి రామకృష్ణ మాట్లాడారు. ఆర్ఎస్ఎస్‌ను 1925లో డాక్టర్ కేశవ్‌బలరాం హెగ్డేవార్ స్థాపించారన్నారు. ఆర్ఎస్ఎస్ ఇప్పటి వరకు దేశ వ్యాప్తంగా లక్షలాది మంది కార్యకర్తలను కర సేవకులుగా తయారు చేసిందన్నారు. ఈ రోజు ఆర్ఎస్ఎస్ ప్రతి గ్రామంలో పద సంచాలమ్ నిర్వహించి, మంజీరా విద్యాలయంలో సామరోపు కార్యక్రమాన్ని చేపట్టిందన్నారు. ప్రస్తుతం యువత సమాజంలో జరుగుతున్న కార్యక్రమాలను దృష్టిలో పెట్టుకుని ముందుకు రావాలన్నారు. దేశ సేవ కోసం దేశ భవిష్యత్ కోసమైనా యువత పాటుపడాలన్నారు. జాతీయ స్థాయిలోనే ఆర్ఎస్ఎస్ మహా పేరు గాంచిందన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ కమల్, కండ కార్యవహ సోమరాజు తదితరులు ఉన్నారు.